క్లుప్తంగా

దాడి ఘటనలో ఏడుగురిపై కేసు

కడియం: వేమగిరి పంచాయతీ పరిధిలోని జక్కంపూడి నగర్ వాసులపై గత నెల 31వ తేదీ రాత్రి దాడికి పాల్పడిన ఏడుగురు యువకులపై కడియం పోలీసులు కేసు నమోదు చేశారు. జి.లోవరాజు అనే యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దిలీప్, పవన్, సురేష్, మచ్చ రాము, కుబేంద్ర, ముస్లి అలియాస్ వంశీ, మిట్టాపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ తెలిపారు. కాగా.. 31న దాడి జరిగినప్పటికీ గ్రామ పెద్దల సమక్షంలో రాజీకీ ప్రయత్నించారన్నారు. అయితే రాజీ కుదరకపోవడంతో లోవరాజు ఇచ్చిన ఫిర్యాదును అనుసరించి 8వ తేదీన కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దోసాలమ్మ కాలనీలో తాటాకిల్లు దగ్ధం

కడియం: కడియపులంక పంచాయతీ పరిధిలోని దోసాలమ్మ కాలనీలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఎస్.సుబ్రహ్మణ్యం, జి.బుల్లెమ్మాయికి చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.రెండు లక్షలు ఆస్తినష్టం సంభవించింది. ఒక్కసారిగా మంటలు చెలరేగాయని, అప్రమత్తమయ్యేలోపుగానే మొత్తం కాలిబూడిదైపోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు. బాధితులను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ పరామర్శించి, సహాయం అందజేసారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం బాధితులను పరామర్శించారు.

టీడీపీతో కలసి పోరాటం

సీటీఆర్ఐ: చంద్రబాబు పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఆయనకు సంఘీభావం తెలపడానికి పవన్ కల్యాణ్ వెళ్తే వైఎస్సార్ సీపీ మంత్రులు, నాయకులు గగ్గోలు పెట్టడం వింతగా ఉందని జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ అన్నారు. పొత్తులు అనేవి ఎన్నికల సమయంలో వచ్చే అంశమని, ఈలోగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేయడానికి ఉమ్మడిగా పోరాటం చేయాలని జనసేన భావించిందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గవర్నర్ పాలన విధించాలని కోరడం తన అభిప్రాయమని ఒక ప్రశ్నకు సమాధానంగా దుర్గేష్ చెప్పారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



వస్త్రాలను పరిశీలిస్తున్న మహిళలు

రాజమహేంద్రవరం సిటీ: వసుధ ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌లో గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలల నుంచి ప్రఖ్యాతి గాంచిన సుమారు 50 మందికిపైగా డిజైనర్లు రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామని నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, సీతాకాంత్ తెలిపారు. జేఎన్ రోడ్డులోని జేకే గార్డెన్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రదర్శన, విక్రయాలు నగర మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయన్నారు. ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నుంచి లేటెస్ట్ డిజైనర్ వస్త్రాలను పరిచయం చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన 11వ తేదీ రాత్రి 9 గంటల వరకు ఉంటుందన్నారు.

కళాజాత ప్రదర్శన

రాజమహేంద్రవరం రూరల్: డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా రాజమహేంద్రవరం ఎస్ఈబీ నార్త్‌స్టేషన్ పరిధిలో సోమాలమ్మగుడి సెంటర్, క్వారీమార్కెట్ ఏరియా సెంటర్‌లో సోమవారం కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగం జీవితాలను ఏవిధంగా నాశనం చేస్తుందో కళాకారులు తెలియజేస్తూ ప్రజలను చైతన్యపరిచారు. నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ పాల్గొన్నారు.

చర్యలు తీసుకుంటాం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు డంపింగ్‌యార్డులో అగ్ని ప్రమాదంపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. అగ్ని ప్రమాదం ఘటనపై రాష్ట్ర స్వచ్ఛంద మిషన్ మేనేజింగ్ డైరెక్టర్ టి.సంపత్ కుమార్‌తో సంప్రదించామన్నారు. యార్డులో ప్లాస్టిక్‌ను తగలబెట్టడం ద్వారా వచ్చే పొగ వల్ల చుట్టూ పక్కల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంపద సృష్టించే ఏజెన్సీల ద్వారా దీని నివారణ చర్యలు తీసుకోవాలని కోరామని జిల్లా పంచాయతీ అధికారి పి.జగదాంబ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేశారన్నారు.

తెలుగువారి గుండెచప్పుడు ఎన్టీఆర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తెలుగువారి గుండెచప్పుడు నందమూరి తారక రామారావు అని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం ఇదే రోజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక అద్భుతం ఆవిష్కృతమైందన్నారు. 1983 జనవరి 5న జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించి, 9వ తేదీన ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ప్రమాణ స్వీకారం చేశారన్నారు. కార్యక్రమంలో గన్ని కృష్ణ, ఎర్ర వేణు గోపాలరాయుడు, మజ్జి పద్మావతి పాల్గొన్నారు.

సొంత స్థలం ఉంటే ప్రభుత్వ సాయం

- ఇంటి కలను సాకారం చేసుకోండి
- లబ్ధిదారులతో ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: సొంత స్థలం ఉన్నవారు ప్రభుత్వం అందించే సాయాన్ని వినియోగించుకుని ఇంటికలను సాకారం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. సొంత స్థలం ఉండి కూడా ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్న వారితో సోమవారం వీఎల్‌పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గృహనిర్మాణ శాఖ అధికారులు, లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ఎంపీ భరత్ రామ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. గడపగడపకూ కార్యక్రమంలో భాగంగా డివిజన్లలో ఎంపీ పర్యటించినప్పుడు పలువురు ఇంటి విషయంపై తమ ఆవేదన తెలియజేశారు. చాలాకాలం క్రితం కట్టుకున్న తమ ఇళ్లు ఇప్పుడు జీర్ణావస్థకు చేరాయని, కొన్ని కూలిపోయాయని, స్థలం ఉన్నా ఇల్లు కట్టుకునే ఆర్థిక స్తోమత లేదని తెలిపారు. వీరందరి సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో ఎంపీ భరత్ ప్రత్యేకంగా ఈ సమావేశం నిర్వహించారు. లబ్ధిదారుల ఇబ్బందులు పూర్తిగా తెలుసుకున్న తరువాత గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు.

తక్కువ ధరకు మెటీరియల్

ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయంతో సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు చక్కని అవకాశం ఉందన్నారు. పీఎంఏవై పథకంలో రూ.1.80 లక్షలు మంజూరవుతాయన్నారు. వాటితో నిర్మాణం సాధ్యం కాదు కనుక, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ద్వారా లబ్ధిదారులకు తక్కువ ధరలకు మెటీరియల్ అందజేసి అందుకోవడం జరుగుతుందన్నారు. నగరంలో ఇందుకు గాను 216 మంది దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు. వీరిలో ఎస్సీలు 60 మంది, ఎస్టీ ఒకరు, బీసీలు 118 మంది, అగ్రవర్ణాలకు చెందిన 37 మంది ఉన్నారన్నారు. దరఖాస్తుదారుల సందేహాలకు ఎంపీ భరత్ రామ్, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.పరశురామ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.సూరిబాబు నివృత్తి చేశారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ కె.ఉమాశంకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు జి.శ్రీనివాసరావు, ఎన్.శ్రీనివాసరావు, జె.శివకృష్ణ, పి.లోవరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు స్టాలిన్, పాలిక శ్రీను, ఎస్వీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్



గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం సిటీ: పారిశుధ్య చర్యలు అధ్వానంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఎంపీ మార్గాని భరత్‌రామ్ శానిటరీ అధికారులను హెచ్చరించారు. సోమవారం స్థానిక 6వ డివిజన్‌లో వార్డు ఇన్‌చార్జి బురిడి త్రిమూర్తులు ఆధ్వర్యంలో స్వామి థియేటర్ వద్ద నిర్వహించిన గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు పారిశుధ్య సమస్యలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, బీసీసెల్ చైర్మన్ మజ్జి అప్పారావు, పార్టీ నాయకుడు లంక సత్యనారాయణ పాల్గొన్నారు.

సూర్యునికి సమర్పించే కృతజ్ఞతే సంక్రాంతి

- నాట్యాచార్యుడు దుర్గాప్రసాద్
- అలరించిన సంక్రాంతి సంబరాలు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): మనిషి మనుగడకు ప్రకృతే సర్వస్వమని, సూర్యునికి కృతజ్ఞతలు తెలపడమే సంక్రాంతి అని ప్రఖ్యాత నాట్యాచార్యుడు డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో లలిత కళాసమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తల్లి వంటి తెలుగును, సంస్కృతీ సంప్రదాయాలను మరువరాదన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబెల్ రాజబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రకృతితో భక్తిభావం కలిగి ఉండాలని కోరారు. ఐక్యుసీ కోఆర్డినేటర్ డాక్టర్ రమణమూర్తి, లలిత కళాసమితి ఉపాధ్యక్షుడు డాక్టర్ పీవీబీ సంజీవరావు ప్రసంగించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాట్యాచారుడు సప్పా దుర్గాప్రసాద్‌ని ఈ సందర్భంగా సత్కరించారు. అధ్యాపకుడు, అకడమిక్ కోఆర్డినేటర్ జి.శరత్ బాబు, జి.రమణ, మేడూరి నరసింహ, జేఏటీ పద్మజ పాల్గొన్నారు.



దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎబెల్ రాజబాబు

ముగ్గుల పోటీలు

సంక్రాంతిని పురస్కరించుకుని 25వ డివిజన్‌లో టీడీపీ వాణిజ్య విభాగం సహకారంతో ఆ పార్టీ కమిటీ సారథ్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని బహుమతులు అందజేశారు. సుమారు 150 మందికి నిత్యావసర వస్తువులతో కూడిన చంద్రన్న కానుక కిట్లను పంపిణీ చేశారు. ఆదిరెడ్డి వాసు, గన్ని కృష్ణ టీడీపీ నాయకులు పాల్గొన్నారు. దేవీచౌక్ సెంటర్ తెలుగు యువత ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కడియం షిర్డీసాయి విద్యానికేతన్‌లో సంబరాలు

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

కడియం: కడియంలోని షిర్డీసాయి విద్యానికేతన్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. హరిదాసు, కొమ్మదాసరి, భట్టరాజులు, సోదెమ్మ, పిట్టలదొర వేషధారణలో విద్యార్థులు అలరించారు. చిన్నారి విద్యార్థులకు ముఖ్యఅతిథులు భోగిపండ్లు పోసి, భోగిమంట వెలిగించి ఆశీర్వదించారు. విద్యార్థుల కుస్తీపోటీలు, కర్రసాము ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి తహసీల్దార్ సుజాత, ఎర్రాప్రగడ రామకృష్ణ, పాఠశాల కరస్పాండెంట్ తంబాబత్తుల పాలేశ్వరరావు సతీమణి నాగమణి, పాఠశాల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, పాఠశాల డైరెక్టర్ విద్య పాల్గొన్నారు.

నేటినుంచి డివిజన్లలో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పోలు విజయలక్ష్మి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆధ్వర్యంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పర్యవేక్షణలో నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో మంగళ, బుధ, గురువారాల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. ఈ వివరాలను సోమవారం ఎంపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు, మాజీ ఫ్లోర్‌లీడర్ పోలు విజయలక్ష్మి విలేకరులకు వెల్లడించారు. మూడు రోజులపాటు డివిజన్లలో పార్టీ ఇన్‌చార్జులు, మహిళా నాయకుల ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహిస్తామన్నారు. 13వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఆర్ట్సు కళాశాల మైదానం జగనన్న సంక్రాంతి సంబరాలను ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, లేడీస్ ఫ్యాషన్‌షో, భరతనాట్యం, డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ఎంపీ భరత్‌రామ్ ఆధ్వర్యంలో బహుమతులు అందిస్తామన్నారు. అనంతరం జగనన్న సంక్రాంతి సంబరాలు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, మాజీ కార్పొరేటర్లు మజ్జి నూకరత్నం, బాపన సుధారాణి, పార్టీ మహిళా నాయకులు సయ్యద్ హసీనా బేగం, కొత్త విజయ రాజ్యలక్ష్మి, అను యాదవ్, దుంగా మంగ, కృష్ణవేణి, అనంతలక్ష్మి, మార్గాని సుశీల పాల్గొన్నారు.

ఎరుకలవీధి పేరుమార్చితే సహించం

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక లక్ష్మీవారపుపేటలో 1939 నుంచి ఉన్న ఎరుకల వీధి పేరును మార్చడానికి ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని బహుజన ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. ఇటీవల ఆ వీధిపేరు ఉన్న బోర్డును కొందరు కూలిచ్చేయడంపై ఏకలవ్య ఎరుకల సంఘం తీవ్ర నిరసన తెలిపింది. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో సోమవారం లక్ష్మీవారపుపేటలోని ఎరుకల వీధిలో సమావేశం నిర్వహించారు. వివిధ సంఘాలు, పార్టీల నాయకులు హాజరయ్యారు. ఏకలవ్య ఎరుకల సంఘం తరపున పునఃప్రతిష్ఠ చేసిన ఎరుకలవీధి బోర్డును నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మల్లి భాస్కరరావు, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్, తిమ్మసర్తి నాగేశ్వరరావు, హెచ్ఆర్ఎఫ్ఐ డైరెక్టర్‌లోసు భూషణరావు (శ్రీకాకుళం), పి.భగవాన్ (విజయనగరం) పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రకాశం నగర్: జీవో నంబర్ ఒకటిని రద్దు చేయాలని కోరుతూ బుధవారం ఉదయం స్థానిక ఆనం రోటరీ హాల్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి యువజన, మహిళా, ప్రజాసంఘాలు పాల్గొనాలని కోరారు.

ప్రచార రథానికి పూజలు

సీతానగరం: తిరుమల తిరుపతి దేవస్థానం వారి హిందూధర్మ ప్రచార రథం సోమవారం సింగవరం, నాగరత్నం కాలనీల్లో పర్యటించింది. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, రథంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి స్థానిక రామాలయం వద్దకు రథం చేరుకుంది. సోమవారం ఉదయం సర్పంచ్ జానం పోసియ్య ఆధ్వర్యంలో ప్రచార రథం బయలుదేరింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మట్ట శ్రీనువాస్, చిర్ల పోశియ్య పాల్గొన్నారు.

పేర్ని నానిని కలిసిన ఉప్పలూరి

రాజమహేంద్రవరం రూరల్: సీతానగరం మండలంలో క్రీడా పోటీలకు హాజరయ్యేందుకు వచ్చిన మాజీ మంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నానిని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉప్పలూరి వీర వెంకట సత్యనారాయణ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తొర్రేడులోని బాలాజీ టౌన్‌షిప్‌లో తన అనుచరులతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఉప్పలూరి ఆధ్వర్యంలో భారీ ఊరేగింపుగా బయలుదేరి సీతానగరం వెళ్లారు. ఉప్పలూరి రాము, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి పేర్ని నానితో సత్యనారాయణ

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలలో సోమవారం వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. రాజానగరం నియోజకవర్గం స్థాయిలో జక్కంపూడి మెగా స్పోర్ట్స్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకూ పది జట్లు తలపడ్డాయి. కోటికేశవరంపై నరేంద్రపురం, వెలుగుబందపై గాడాల విజయం సాధించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ నాలుగు, ఆ తర్వాత రాత్రి వరకూ 6 మ్యాచ్‌లు జరిగాయి. చినకొండేపూడి - కాపవరం, కోరుకొండ - చక్రద్వారబంధం, నరేంద్రపురం - చక్రద్వారబంధం, కోటికేశవరం - చినకొండేపూడి, శ్రీరంగపట్నం - నల్లగొండ, దోసకాయలపల్లి - కోటి జట్ల మధ్య పోటీ హోరాహోరీగా జరిగింది. కాగా... ఈ పోటీల్లో జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాకారులు ఆడుతున్నారు. గాడాల జట్టులో ఆటగాడైన వెంకట శివ ఆంధ్రప్రదేశ్ తరపున ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగిన పోటీల్లో ఆడి రాణించాడు. సీతానగరం జట్టులో ఉన్న ఎం.దుర్గాప్రసాద్ ఇటీవల చెన్నైలో నిర్వహించిన పోటీల్లో రాణించాడు. కాగా.. ప్రథమ బహుమతిగా రూ.60 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు, నాలుగో బహుమతిగా రూ.10 వేలు, ఐదో బహుమతిగా రూ.6 వేలు, ఆరో బహుమతిగా రూ.5 వేలు అందజేయనున్నారు. 45 గ్రామాలకు చెందిన వాలీబాల్ క్రీడాకారులను 4 గ్రూపుల్లో 32 టీములుగా విభజించారు. రిఫరీలుగా ఏ. శ్రీనివాసరావు, ఏ.సుధాకర్, సత్యప్రసాద్, ఇబ్రహిం, సూర్యమోహన్, సీతాపతి, గణేష్, నాగరాజు వ్యవహరించారు.



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

రైతుబజార్లతో ఎన్నో ప్రయోజనాలు



రైతుబజార్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మార్గాని భరత్ రామ్, చందన నాగేశ్వర్

- ఎంపీ భరత్ రామ్, కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- ధవళేశ్వరంలో నూతన భవనానికి శంకుస్థాపన

రాజమహేంద్రవరం రూరల్: తమ పంటలను నేరుగా రైతులే ప్రజలకు గిట్టుబాటు ధరకు విక్రయించుకోవడానికి రైతుబజార్లు దోహదపడతాయని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వద్ద రూ.43 లక్షలతో నిర్మిస్తున్న రైతు బజారు భవనానికి సోమవారం వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ ఆరుగాలం రైతులు శ్రమించి పండించిన పంట దళారుల పాలుకావడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అలాగే భారీ ధరలకు విక్రయించడంతో కొనుగోలుదారులకూ నష్టం కలుగుతోందన్నారు. దీంతో ప్రభుత్వం ప్రజలకు, రైతులకు నష్టం లేకుండా రైతుబజార్లను ఏర్పాటు చేస్తోందన్నారు. రైతులు తాము పండించిన తాజా కూరగాయలను నేరుగా రైతు బజార్లకు తీసుకొచ్చి, రైతులే ప్రజలకు విక్రయించుకునే చక్కని వెసులుబాటు కల్పించిందన్నారు. వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ త్వరితగతిన రైతుబజార్ నిర్మాణం చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మార్కెట్ కమిటీ అధికారులకు సూచించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వీర్రాజు (బాబు), రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆంజనేయులు, ధవళేశ్వరం వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

98 శాతం హామీలను నెరవేర్చిన సీఎం జగన్



ధవళేశ్వరంలో పారిశుధ్య సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- ప్రజాసంకల్పయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వేడుకలు

రాజమహేంద్రవరం రూరల్: జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో చూసిన ప్రజల కష్టాలను తీర్చడానికి మ్యానిఫెస్టో రూపొందించారని, సీఎం అయ్యాక ఇప్పటి వరకూ 98 శాతం హామీలను నెరవేర్చారని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. ప్రజాసంకల్పయాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో సోమవారం ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. పారిశుధ్య కార్మికులకు చందన చేతుల మీదుగా దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 341 రోజుల పాటు 3,648 కిలోమీటర్ల మేర 134 నియోజకవర్గాలు, 231 మండలాలు, 2,516 గ్రామాలలో పాదయాత్ర చేపట్టారన్నారు. మ్యానిఫెస్టోను భగవద్గీతగా, బైబిల్‌గా, ఖురాన్ గా భావించి, దానిలో పొందుపరిచిన ప్రతి అంశాన్ని తప్పకుండా నెరవేర్చుతున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), వైఎస్సార్ సీపీ ధవళేశ్వరం నాయకులు పాల్గొన్నారు.

అందరి సంక్షేమమే జగన్ ధ్యేయం

- ఎంపీ భరత్ రామ్
- 47వ డివిజన్‌లో గడపగడపకూ మనప్రభుత్వం

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో ప్రజలందరి సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక 47వ డివిజన్ క్వారీ మార్కెట్ సెంటర్ సిద్ధార్థ్ నగర్ రైతు బజార్ వద్ద వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి చోడిశెట్టి సత్యవాణి ఆధ్వర్యంలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అవి అందడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఇద్దరు మహిళలు తమ జీవితాలకు ఆధారం కల్పించాలంటూ ప్రాధేయపడ్డారు. ఒకామె భర్త తనను విడిచి పదేళ్లు అవుతోందని, బతుకు కష్టమవుతోంది, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరింది. మరో మహిళ మాట్లాడుతూ తన భర్త గోదావరిలో పడి మృతి చెంది రెండేళ్లు అవుతోందని, కుటుంబ గడవడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. చలించిన ఎంపీ భరత్‌రామ్ వారిని ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఒంటరి మహిళ పెన్షన్ వచ్చేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, హితకారిణి సమాజం డైరెక్టర్ గుడాల ఆదిలక్ష్మి, తిరగాటి దుర్గ, గుడాల ప్రసాద్, ఎస్.ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్

ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు

రాజానగరం: మండలంలోని పాలచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రవేశంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎట్టకేలకు తొలగించారు. విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ విషయాన్ని ఇటీవల నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దృష్టికి గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తీసుకువెళ్లారు. దీనితో కలెక్టర్ ఆదేశాలను అనుసరించి ఆ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించారు.

నిందితులకు 14 రోజుల రిమాండ్

బిక్కవోలు: కొమరిపాలెంలో సంచలనం సృష్టించిన హత్య కేసులో నిందితులకు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జనవరి 1న కొమరిపాలెం గ్రామానికి చెందిన కొమరపు చిన్నబాబుని హత్య చేసిన నేరంలో ఎనిమిది మందిని సోమవారం కోర్టు ఎదుట హాజరుపరచగా వారికి 14 రోజులు రిమాండ్ విధించారని ఆయన చెప్పారు.

ఆలయం గోడ ధ్వంసం

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు అఫీషియల్ కాలనీలోని వరసిద్ధి వినాయక మందిరంలోకి తాడేపల్లి వెంకటేశ్వరరావు (బోయాజు) చెప్పులతో ప్రవేశించడంతో పాటు ఆయుధాలతో గోడను ధ్వంసం చేశాడని ఆ కాలనీ వాసులు సోమవారం రాత్రి రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అడ్డుకున్న మహిళలను దుర్భాషలాడడంతో పాటు గెంటివేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశాడన్నారు. గుడిలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి పట్టుకుని పోయాడన్నారు. సంఘటన స్థలాన్ని రాజానగరం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్, సిబ్బంది పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్‌పికెట్‌ను ఏర్పాటు చేశారు.